పోటీలు చోటుచేసుకుంటున్నాయి. వరల్డ్ క్యూబ్ అసోసియేషన్ ఏటా వెయ్యికి పైగా పోటీలను నిర్వహిస్తున్నది. వరల్డ్ క్యూబ్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏ) ద్వైవార్షిక పోటీలను నిర్వహిస్తున్నది. 2x2, 3x3, 7x7 ఇలా 17 విభాగాల్లో ఈ పోటీలు సాగుతాయి. అలాగే క్యూబ్ రూపంలోనూ మార్పులు ఉంటాయి. ఇక మొదటిసారి క్యూబ్‌ను పరిష్కరించిన తర్వాత రూబిక్ చాలా రిలీఫ్‌గా ఫీలయ్యాడు. ఏదో సాధించానన్న అనుభూతి తనకు కలిగిందంటాడు. ఇప్పుడైతే రూబిక్స్ క్యూబ్‌ను గెలవడం అనే అంశంలో విపరీతమైన పోటీ నెలకొంది. ఈ క్రమంలో వేగంగా పరిష్కరించే సామర్థ్యం ఉన్న 'స్పీడ్ క్యూబర్స్' పుట్టుకురావడం గమనార్హం. 2018లో చైనాకు చెందిన యుషెంగ్ డు 3.47 సెకండ్లలో చకచకా దాన్ని పూర్తిచేశాడు.

## రికార్డులే రికార్డులు




వేగంగా 3X3 రూబిక్స్ క్యూబ్‌ను పరిష్కరించిన రికార్డు నిఖిలేశ్ పీఎస్ సొంతం. 2022 ఏప్రిల్ 21న బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో క్యూబ్‌ను 54 సెకండ్ల 65 సెంటీ సెకండ్లలో పరిష్కరించి నిఖిలేశ్ కొత్త ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు. 2014 అక్టోబరు 19న గాది రాజు కృష్ణంరాజు 24 గంటల్లో ఒంటిచేత్తో 2,176 రూబిక్ క్యూబ్‌లను పరిష్కరించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు. అఫాన్ కుట్టీ.. బ్లైండ్ ఫోల్డ్ రూబిక్ చాంపియన్ పోటీల్లో కళ్లకు గంతలు కట్టుకుని క్యూబ్‌ను పరిష్కరించి అందరినీ ఆకట్టుకున్నాడు.




## క్యూబ్‌తో ఆడుకోండి

''క్యూబ్ అనేది అన్నిటికి సార్వజనీనమైన నమూనాగా మారింది. విద్య అనేది కుతూహలాన్ని పెంచేదిగా, సమస్యలను పరిష్కారానికి ఉత్సాహాన్ని కలిగించేదిగా ఉండాలి. మనదైన పరిష్కారాన్ని కనుక్కోగలిగినప్పుడు మరింత ఆనందం కలుగుతుంది'' అంటాడు రూబిక్ 'హార్వర్డ్ బిజినెస్ రివ్యూ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో. క్యూబ్‌తో తన అనుభవాలకు రూబిక్ 2020లో 'క్యూబ్డ్' పేరుతో పుస్తక రూపం ఇచ్చాడు. ప్రస్తుతం రూబిక్ బ్రాండ్ బాధ్యతలను కెనడాకు చెందిన స్పిన్ మాస్టర్ కార్పొరేషన్ చూస్తున్నది. ఆ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో రూబిక్ ఒకరు. 78 ఏండ్ల వయసులో ఉన్న రూబిక్ ఇప్పుడు ఒకే ఒక్క నిమిషంలో క్యూబిక్ పజిల్‌ను పరిష్కరించగలడు. కానీ వేగంపైన తనకు ఆసక్తి లేదని, నింపాదిగా పరిష్కారం కనుగొనటం, అందులో నాణ్యతను ఆస్వాదిస్తానని, టైమింగ్ అనేది తనకు పట్టదని ఆయన అంటాడు. ఇప్పుడు క్యూబ్ డిజైన్ మార్పు చేయటం గురించి ఆయన ఆలోచించటం లేదు. దానిని మరింత మెరుగ్గా ఎలా వినియోగించే విషయం గురించి ఆలోచిస్తున్నాడు. మీరు కూడా రూబిక్స్ క్యూబ్‌ని మీ స్నేహితునిగా మార్చుకుని చూడండి. ఆ మజా ఏమిటో మీకే అర్థమవుతుంది



## ప్రపంచ విజేత

కొరియన్- అమెరికన్ మాక్స్ పార్క్‌ను అన్ని కాలాల్లోనూ అత్యుత్తమ క్యూబర్‌గా పరిగణిస్తారు. 2001 నవంబరు 28న పుట్టిన పార్క్ 3x3x3 క్యూబ్ వరల్డ్ ఛాంపియన్ పోటీల్లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 2023 జూన్ 11న నిర్వహించిన ఈ పోటీల్లో 3.13 సెకండ్లలో దాన్ని పరిష్కరించాడు. అతని స్నేహితుడు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా చాంపియన్‌గా నిలిచిన ఫిలిక్స్ జాండెగ్స్... ఈ ఇద్దరి గురించి నెట్ ఫ్లిక్స్‌లో వచ్చిన డాక్యుమెంటరీ 'ద స్పీడ్ క్యూబర్స్' బాగా ప్రాచుర్యం పొందింది.